క్లుప్తంగా

వ్యర్థాలు తరలిస్తున్న వ్యక్తికి జరిమానా



జరిమానా రసీదు ఇస్తున్న కమిషనర్ శంకర్

ఆమనగల్లు: పట్టణంలో అనుమతిలేకుండా చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని శనివారం సాయంత్రం ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ పట్టుకున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తున్న అంజద్‌కు మున్సిపల్ యాక్ట్ ప్రకారం రూ.18వేలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సిబ్బంది రామకృష్ణ, మహబూబ్, గోపాల్, చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన బుచ్చమ్మకు సీఎం సహాయనిధి రూ.60వేలు, ఉప్పరమణి నర్సింహాకు రూ.20వేలు మంజూరయ్యాయి. తలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్‌కమిటీ డైరెక్టర్ అంజయ్యగుప్తా, అజీమ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు నర్సింహా, రాజిరెడ్డి, పాండు, మల్లేశ్, యాదగిరి, గణేశ్, పురుషోత్తం, ఉపేందర్, ఆదేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి



నక్కగుట్ట తండా సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి

యాచారం: వాహనాదారులు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సాగర్‌రోడ్డుపై నక్కగుట్టతండా సమీపంలో శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్ల లైసెన్సు, ఆర్‌సీలను పరిశీలించారు. అతి వేగం, పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తీసుకెళ్లొద్దని డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు.

విద్యార్థిని చికిత్సకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న మహేశ్ తదితరులు

ఆమనగల్లు: వెల్జాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రసన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుంది. ఈ సందర్భంగా శనివారం కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం చికిత్స కోసం కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, అంబాజీ, నర్సింహులు, అజీజ్, ఆరీఫ్, కృష్ణయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, ఆంజనేయులు, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు సాయం

నందిగామ: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో నిత్యపూజలు చేస్తున్న అర్చకులకు అదే గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ రేగొండ రవీందర్‌రెడ్డి శనివారం ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి చేతుల మీదుగా రూ.40 వేల నగదును అర్చకులకు అందజేశారు. దాత రవీందర్‌రెడ్డిని అర్చకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, దార లింగం తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



మంచాల: జాపాలలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తలకొండపల్లిలో రిజర్వేషన్లు అమలు చేయాలని ర్యాలీ



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపో వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు



తుర్కయంజాల్: బంద్‌లో అఖిల పక్ష నాయకులు



తలకొండపల్లి: బంద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్



ఇబ్రహీంపట్నం: బంద్‌కు మద్దతుగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పట్నంలో ర్యాలీ



ఇబ్రహీంపట్నం: బంద్‌కు మద్దతుగా పట్నంలో బీజేపీ నేతల ర్యాలీ

బంద్ విజయవంతం

స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ అమలు కోసం బీసీ సంఘాలు, జేఏసీ తలపెట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. శనివారం నిర్వహించిన బంద్‌కు ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు నియోజకవర్గంలో ఆయా పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు మద్దతు తెలిపారు. రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ జాతీయ రహదారులపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కెబినెట్‌లో ఆమోదించిన బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు.



తలకొండపల్లి: బంద్‌లో సీపీఎం నాయకులు



యాచారం: ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ తదితరులు



ఇబ్రహీంపట్నం: బస్సులు లేక బోసిపోయిన ఇబ్రహీంపట్నం బస్టాండ్



ఆమనగల్లు: బంద్‌లో బీసీ ఐక్యవేదిక నాయకులు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వాధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హెచ్చరించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని శనివారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో కేవలం జూనియర్ అసిస్టెంట్ ఝాన్సి ఒక్కరే విధుల్లో ఉన్నారు. మిగతా అధికారులు, సిబ్బంది ఎందుకు రాలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అయితే ఎంపీడీఓ కుసుమ మాధురి లీవ్ పెట్టారని సమాధానమిచ్చారు. హాజరు రిజిస్టర్‌లో లీవ్ లేకుండా ఖాళీగా ఉండడంతో ఎమ్మెల్యే ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో అటెండర్ రమేశ్ వచ్చి ఎంపీడీఓ విధులకు వచ్చి అరగంట క్రితం టూర్ వెళ్లారని చెప్పడంతో నిన్ను ఎవరూ అడిగారు... ఎందుకు అబద్ధం చెప్తున్నావంటూ అటెండర్‌పై ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. వెంటనే ఫోన్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేసి విధులకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు ఇష్టారీత్య విధులు నిర్వహిస్తే సహించమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, కాంగ్రెస్ నాయకులు మెకానిక్ బాబా, శేఖర్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు నుచ్చుగుట్ట తండాలో మృతిచెందిన వెంకట్‌నాయక్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.



ఉద్యోగుల హాజరు రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

డంపింగ్ యార్డ్ తరలించాలని వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

తుర్కయంజాల్: ఇళ్లమధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ తరలించాలని ఆదిత్యానగర్ ఫేజ్ 2 కాలనీ వాసులు శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నాలుగు ఏళ్లుగా నివాసాల మధ్య డంపింగ్ యార్డ్ తరలించాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. రూ. లక్షలు వెచ్చించి ఈఎంఐ చెల్లింపులో ఇళ్లను కొనుగోలు చేసుకున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అంతేకాకుండా మాసబ్ చెరువులోకి పైనుంచి వచ్చే నీటివల్ల, డంపింగ్ యార్డ్ పక్కనే ఉండడంతో చెరువు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డి. రేనారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సభ్యులు జంగయ్య, రాజు, రమేష్, సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చల్లంపల్లిలో వైద్య శిబిరం

కడ్తాల్: చల్లంపల్లి గ్రామంలో ఉచిత మొబైల్ ఆరోగ్య శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్, వన్ మెడీహబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కన్సల్టేషన్, అవసరమైన వారికి వైద్య పరీక్షలు, నిపుణులైన డాక్టర్లచే వైద్య సలహాలు, సూచనలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోని రోగులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సూచించారు.

రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి

కందుకూరు: రైతులకు న్యాయం జరిగేలా కందుకూరు సొసైటీ నుంచి సకాలంలో రుణాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సొసైటీ డైరెక్టర్ ఎస్.శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పాత, కొత్త చైర్మన్ల విషయంలో పీటముడి పడిందన్నారు. కోర్టు తీర్పు ప్రభుత్వం అమలు చేయకపోవడంతో రైతులకు రుణాలు ఇవ్వడానికి వీలు లేకుండా పోయిందన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రత్యేకాధికారినైనా నియమించి రుణాలు అందేలా చూడాలని కోరారు.

ట్రాఫిక్ పోలీసులను నియమించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మన్సూరాబాద్: రాజీవ్‌గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని అంతవరకు విద్యార్థులు రోడ్డు దాటేందుకు వారికి సహాయం చేసేందుకు ట్రాఫిక్ పోలీసులకు నియమించాలని బీఆర్‌ఎస్ నేత మామిడి రాంచందర్, కాంగ్రెస్ నేత జోగు రాములు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి శనివారం అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారని రెండ్రోజుల క్రితం బస్తీకి చెందిన విద్యార్థి తల్లి రోడ్డు దాటుతుండగా బస్సు ప్రమాదానికి గురై మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామంలో ఏడు రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపు శనివారం ముగిసింది. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం రాయపోల్ గ్రామస్తులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణంపై అవగాహన కల్పించారు. శ్రమదానం చేసి చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎన్ఎస్ఎస్ చేపట్టిన కార్యక్రమానికి గ్రామస్తులు పూర్తి సహకారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, పంచాయతీ కార్యదర్శి అలివేలు, మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, రాష్ట్ర సేవా దళ్ ఉపాధ్యక్షుడు మంఖాల దాసు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, గోవర్ధన్ పాల్గొన్నారు.



రాయపోల్ ముగింపు వేడుకల్లో ఎంపీడీఓ వెంకటమ్మ, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన నాయకులు

కడ్తాల్: రావిచేడ్ గ్రామానికి చెందిన పోచమ్మకు రూ.8వేలు, మద్దెలకుంట తండాకు చెందిన కాట్రవత్ శ్రీలతకు రూ.38 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరయ్యాయి. వాటిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో శనివారం బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీను, మాజీ సర్పంచ్‌లు విఠలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, నాయకులు జనార్ధన్‌గౌడ్, రమేశ్‌గౌడ్, యాదయ్య, భాస్కర్, రాజు, పారేషా, అంజయ్య, వెంకటేశ్, దైవాదీనం, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ జగదీశ్వర్ అధ్యక్షతన 2023–24నుంచి 2025–26విద్యా సంవత్సరాలకు గాను మండల ఉత్తమ ఉపాధ్యాయులను శనివారం హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ ఇంద్రసేనారెడ్డి, పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, జీహెచ్‌ఎంలు రమేష్‌కుమార్, జయంత్‌రాం, విజయభాస్కర్, ఎంఆర్‌సీ సిబ్బంది మహేష్, గీతారాణి, శ్రీలతతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలందరి సహకారంతోనే బంద్ ప్రశాంతం

షాద్‌నగర్‌రూరల్: బీసీ రిజర్వేషన్ కోసం చేపట్టిన బంద్ ప్రజలందరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిందని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పట్టణ సీఐ విజయ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ కోసం చేపట్టిన రాష్ట్ర బంద్ కార్యక్రమం నియోజకవర్గంలో ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతంగా సాగిందన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మద్యం మత్తులో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అపరిచిత వ్యక్తులు ఎక్కడ కనిపించినా పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరి సహకారం మరువలేనిదన్నారు.